Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి: 26 | సంచిక: 333 | హైదరాబాద్ | మంగళవారం 20 అక్టోబరు 2026 | పేజీలు: 8 | వెల: రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR



### 'స్థానిక' నామినేషన్ల
## గడువు పొడిగించండి

- సుప్రీంకోర్టును అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్
- నామినేషన్ల సమయం ముగిసిందన్న ధర్మాసనం తీర్పు సరికాదు
- ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగితే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చు
- ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగితే ఎస్ఈసీ షెడ్యూల్ మార్చవచ్చు
- ఇందుకు ఎన్నికల నిబంధనలు వీలు కల్పిస్తున్నాయి

**న్యూఢిల్లీ, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికల్లో అధికార కూటమి పాల్పడిన అరాచకాలపై వైఎస్సార్‌సీపీ -2వ పేజీలో



## ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- 28 సబ్‌స్టేషన్లు, ఇంధన కేంద్రాలు ధ్వంసం
- నిలిచిన విద్యుత్, నీటి సరఫరా

**కీవ్, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

బాలిస్టిక్ క్షిపణులు , జెట్-పవర్డ్ డ్రోన్లను ఉపయోగించి ఉక్రెయిన్ విద్యుత్ , ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా కొత్త దాడులు చేసిందని అధ్యక్షుడు వోలోడిమిర్ జె లెన్స్కీ సోమవారం తెలిపారు. గతంలో తమ నిఘా సమాచారాన్ని పంచుకున్న భాగస్వామ్య దేశాల నుంచి ఈ దాడి గురించి ఎటువంటి ముందస్తు హెచ్చరిక అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఓ యువతి మృతి చెందింది. రష్యా( రాత్రి పూట జరిపిన దాడిలో 28 సబ్‌స్టేషన్లు, ఇతర కీలక ఇంధన కేంద్రా లు దెబ్బతిన్నాయని, దీంతో ఐదు లక్షల మందికి పైగా ప్రజలకు విద్యుత్, నీటి సరఫరా నిలిచిపోయిందని జెలె న్స్కీ సోషల్ మీడియాలో తెలిపారు.రష్యా కీవ్, దాని పరిసర ప్రాంతాలపై 16 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిం చిందని తెలిపారు. ఈ దాడిలో 21 ఏళ్ల మహిళ మరణించినట్లు రాజధానిలోని అధికారులు పేర్కొ న్నారు. ఒక డేటా సెంటర్, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల విడిభాగాలను నిల్వ చేసే ఒక లాజిస్టిక్స్ హబ్, డ్రోన్ విడిభాగాల ను తయారుచేసే ఒక పారిశ్రామిక కేంద్రం, క్షిపణులను నిల్వ ఉంచే ఒక లోకోమోటివ్ డిపోతో సహా ఉక్రెయిన్‌లోని లక్ష్యాలపై దాడి చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.



## రేషన్ షాపుల్లో గోధుమ పిండి, నిత్యావసరాలు!

- పరిశీలించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం
- ఎల్‌నినో నేపథ్యంలో సమీక్ష.. ముందస్తు సన్నద్ధతపై చర్చ

**హైదరాబాద్, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు -2వ పేజీలో



# రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే వేదిక

- గ్లోబల్ సమిట్ 2.0ను వైభవంగా నిర్వహిద్దాం
- నవంబరు 15 నాటికి అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయండి
- వచ్చే జూన్‌లో రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్-1 ప్రారంభిద్దాం
- ఫ్యూచర్ సిటీ సందర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ -కందుకూరు, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

"తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు మనం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో గ్లోబల్ సమిట్ 2.0ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు వైభవోపేతంగా కొనసాగాలి. సంబంధిత పనులన్నీ నవంబరు 15 వరకు పూర్తి చేయాలి. సమిట్‌కు వేదికైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సకల సదుపాయాలను సమకూర్చాలి. విదేశీ అతిథులు, పెట్టుబడిదారుల రాకను పరిగణనలోకి తీసుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీ, టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీలో చేపట్టిన గ్లోబల్ సమిట్ 2.0 పనుల తీరును ఆయన సోమవారం పరిశీలించారు. సాయంత్రం 6.15 గంటలకు ఇక్కడికి చేరుకున్న ఆయన... సుమారు గంటన్నరపాటు పర్యటించారు. తొలుత రతన్‌టాటా రేడియల్ రోడ్-1 నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది జూన్ 2న ఈ రహదారిని ప్రారంభించేందుకు వీలుగా భూసేకరణతోపాటు అన్ని పనుల్లో వేగం పెంచాలన్నారు. అనంతరం -2వ పేజీలో

> "తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు మనం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో గ్లోబల్ సమిట్ 2.0ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు వైభవోపేతంగా కొనసాగాలి. సంబంధిత పనులన్నీ నవంబరు 15 వరకు పూర్తి చేయాలి. సమిట్‌కు వేదికైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సకల సదుపాయాలను సమకూర్చాలి. విదేశీ అతిథులు, పెట్టుబడిదారుల రాకను పరిగణనలోకి తీసుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టండి"
> -ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## ఏండ్ల వేళ ఆర్టీసీ టికెట్ ధరల్ని రెట్టింపు చేశారు

### భారాస నేత హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండగల వేళ ఆర్టీసీ టికెట్ ధరల్ని రెట్టింపు చేసి రాష్ట్ర ప్రభుత్వం.. ప్రజలను నిలువు దోపిడీ చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. "బతుకమ్మ, దసరా పండగల వేళ ప్రజలకు ప్రభుత్వం కానుకలు ఇవ్వాలి. కానీ, రేవంత్‌రెడ్డి ఆర్టీసీ ధరలు పెంచి ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు రూ.230 ధర ఉంటే దాన్ని ఏకంగా రూ.400కు పెంచారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ.220 ఉంటే.. దాన్ని రూ.290 చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్గాల్లో టికెట్ ధరల్ని రెట్టింపు చేసి పండగ సంబరం లేకుండా చేశారు" అని ఆరోపించారు.

### మహాలక్ష్మి, ప్రత్యేక బస్సుల నిర్వహణలో లోటుపాట్లు లేవు: టీజీఎస్ఆర్టీసీ

మహాలక్ష్మి పథకం, దసరా పండగ ప్రత్యేక బస్సుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేవని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. పండగల -2వ పేజీలో

# 'ఫ్యూచర్' అభివృద్ధిలో మరో ముందడుగు

### పోలీసు కమిషనరేట్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్‌సిటీ ప్రాంత అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని విశాల ప్రాంగణంలో నిర్మించిన కార్యాలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు హెలికాప్టర్‌లో ఇబ్రహీంపట్నం చేరుకున్న రేవంత్‌రెడ్డి.. నేరుగా కమిషనరేట్ భవనం దగ్గరికి వెళ్లారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి భవనం లోపల వసతులను పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ పోలీసు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో కొత్త కార్యాలయంలో కమిషనర్ -2వ పేజీలో






## తుది జాబితాలో మరో 83 లక్షల ఓట్లు

- నోటీసులకు సమాధానమిచ్చిన ఓటర్లు
- సరైన పత్రాలివ్వని 30 వేల మంది ఓట్లు అవుట్!
- మరో 15 రోజులు మాత్రమే గడువు

**హైదరాబాద్, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా నోటీసుల విచారణలో ఇప్పటివరకు 83,03,355 మంది ఓటరు జాబితాకు అర్హత సాధించారు. 30,407 మంది ఓటర్లు సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో వారు తుది జాబితాలో ఉండడానికి అనర్హులుగా గుర్తించారు. ఇందులో అనామలీస్ విభాగంలో 12,718 మంది, అన్-మ్యాపింగ్ విభాగంలో 17,689 మంది ఉన్నారు. విచారణ ప్రక్రియకు మరో 15 రోజుల గడువు మాత్రమే ఉంది. నవంబరు 5తో నోటీసు దశ ముగియగానే 9న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో 'సర్' ఓటర్ల ముసాయిదా జాబితా అనంతరం మొత్తం 92,88,188 మందికి నోటీసులను అందించారు. ఇందులో 92,65,731 మందికి ఇప్పటి వరకు నోటీసులు -2వ పేజీలో

## 'ఎల్‌నినో'పై మంత్రివర్గ ఉపసంఘం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటు
- సభ్యులుగా ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, సీతక్క, వాకిటి



**హైదరాబాద్, అక్టోబరు 19 (ప్రజాతీర్పు)**

రాష్ట్రంలో కరవు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని అధిగమించేందుకు సిఫార్సులు చేయడానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా రాష్ట్ర నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరిలు నియమితులయ్యారు. ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితునిగా సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.వర్షాభావ పరిస్థితులపై -2వ పేజీలో

# రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే వేదిక

(మొదటి పేజీ తరువాయి)

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులు సిద్ధం చేసిన చిత్రపటాలను వీక్షించారు. ఏ చిన్న అంశాన్నీ వదలకుండా షెడ్యూలు ప్రకారం పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంకను ఆదేశించారు. సదస్సు నిర్వహణకు నియమించిన ప్రత్యేక కమిటీలతో సమన్వయం చేసుకుని, రోజువారీ పురోగతిని సమీక్షించాలని సూచించారు.

### తొలుత సమిట్.. తర్వాతే వర్సిటీ తరగతుల పనులు

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కొనసాగుతున్న నిర్మాణాలను సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. “మీ పెట్టుబడులకు మాది భరోసా అనే కాన్సెప్ట్‌తో ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్-2026’ను నిర్వహిస్తున్నట్లు విషయం మీకు తెలిసిందే. అందుకే తొలుత సమిట్ పనులను పూర్తిచేశాక వర్సిటీ తరగతి గదుల నిర్మాణాలను చేపట్టండి. సిబ్బంది సంఖ్యను పెంచుకుని దసరా తర్వాత పనులను వేగవంతం చేయాలి. దేశవిదేశాల నుంచి వస్తున్న పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు ఉండాలి. బహిరంగ ప్రాంగణం పనులు నవంబరు 15లోపు పూర్తి చేయాల్సిందే. ఇది కేవలం వ్యాపార సదస్సుగా మాత్రమే కాకుండా... తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే గొప్ప వేదికగా నిలవాలి” అని స్పష్టంచేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పనులను 2027 ఫిబ్రవరిలో పూర్తి చేస్తే... మార్చి నుంచి ప్రవేశాలను ప్రారంభించేందుకు అనువుగా ఉంటుందని ఈ దిశగా పనులు జరుగుతున్నాయా.. లేదా... అన్న అంశాలపై తనకు ప్రతివారం నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

### సదస్సు ప్రాంగణానికి రెండు రహదారులు...

‘ఇన్వెస్ట్ తెలంగాణ’ సదస్సు కోసం రెండు రహదారులు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 2025 డిసెంబరులో జరిగిన తొలి సదస్సులో వీవీఐపీలు, విదేశీ అతిథులు వచ్చినప్పుడు కొంతసేపు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయని.. ఈసారి అలా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దాంతో స్కిల్స్ యూనివర్సిటీ నుంచి ప్రధాన రహదారిని అనుసంధానిస్తూ నాలుగు వరుసల రహదారిని నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె.శశాంక... ముఖ్యమంత్రికి తెలిపారు. పది, పదిహేను రోజుల్లోనే కొత్త రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. సీఎం పర్యటన కార్యక్రమంలో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

# తుది జాబితాలో మరో 83 లక్షల ఓట్లు

(మొదటి పేజీ తరువాయి)

అందాయి. ఇంకా 22,457 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉంది. నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటి వరకు అనామలీస్ విభాగంలో 56,86,890 మంది, అన్-మ్యాపింగ్ విభాగంలో 26,16,465 మంది ధ్రువపత్రాలు సమర్పించి తుది ఓటర్ల జాబితాలో స్థానం సంపాదించారు. నోటీసులు అందుకున్న మరో 9.6 లక్షల మంది ఓట్లు పరిశీలనలో ఉన్నాయి. ముసాయిదా ఓటరు జాబితా రోజు అన్ని సక్రమంగా ఉన్న ఓటర్లు 1,66,81,849 మంది ఉన్నారు. ఈ ఓటర్లు, ఇప్పటి వరకు నోటీసులకు సమాధానం ఇచ్చి అర్హత సాధించిన ఓటర్లను కలుపుకొంటే తుది జాబితాలోకి 2,49,85,204 అర్హత సాధించారు.

### అత్యధికంగా రంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల పరిధిలో..

నోటీసులు అందుకున్న ఓటర్లలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో తమ ఓటును కోల్పోయారు. ఈ జిల్లా పరిధిలో మొత్తం 8,208 మంది సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో తొలగింపు జాబితాలో ఉంచారు. తర్వాత ఎక్కువగా పెద్దపల్లి జిల్లాలో 4,424 మంది ఓట్లను అనర్హత జాబితాలో ఉంచారు. అతి తక్కువగా ఆదిలాబాద్‌లో 71 మందిని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 167 మంది ఓట్లను తొలగించనున్నారు.

# ‘స్థానిక’ నామినేషన్ల గడువు పొడిగించండి

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నగరపాలక, పురపాలక సంస్థల నామినేషన్ల గడువు పొడిగించాలని కోరింది. నామినేషన్ల గడువును మరో రోజు పొడిగించేందుకు నిరాకరిస్తూ ఈ నెల 18న హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ పిటిషన్‌లో సవాలు చేసింది. నామినేషన్ల గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, ఈ దశలో గడువును పొడిగించడం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమే అవుతుందని హైకోర్టు పేర్కొనడం సరికాదని వివరించింది.

ఎన్నికల నిబంధనల్లోని రూల్ 7 ప్రకారం.. ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగినప్పుడు ఎస్‌ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి తిరిగి నోటిఫై చేసే అధికారం ఉందని, ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగినప్పుడు రాజ్యాంగబద్ధమైన న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని పిటిషన్‌లో వైఎస్సార్‌సీపీ పేర్కొంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా పెద్దఎత్తున జరిగిన దాడులు, అడ్డగింపులపై ఆధారాలను సుప్రీంకోర్టు ముందుంచింది. అభ్యర్థులను అడ్డుకున్న సదరు పట్టణ స్థానిక సంస్థల్లో ఏ ఒక్క అభ్యర్థినీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే ప్రక్రియను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలిపివేస్తూ స్టే విధించాలని అభ్యర్థించింది.

అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పించడంతో పాటు అక్టోబర్ 18తో ముగిసిన నామినేషన్ల గడువును పొడిగించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. అభ్యర్థులు సురక్షితంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా అదనపు, ప్రత్యామ్నాయ కేంద్రాలను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తరఫున ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్-ఎల్‌పీ)ను న్యాయవాది మహ్ఫూజ్ అహ్సన్ నజ్కీ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇతరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

### రేపు విచారణ

వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై అక్టోబర్ 21న (బుధవారం) సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. విచారణ జాబితాలో మొదటి స్థానంలో ఉన్న ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించనుంది.

### పిటిషన్‌లో ముఖ్యాంశాలు

### తొలి రోజు నుంచే దాడులు

అక్టోబర్ 16న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజు నుంచే పాలక పార్టీ అరాచకాలు, దాడులు ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష అభ్యర్థులు రిటర్నింగ్ అధికారుల వద్దకు చేరుకోకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారు. పుంగనూరు, రాయచోటిలో అభ్యర్థులతో పాటు వెళ్లిన పార్టీ లోక్‌సభాపక్ష నాయకుడు ఎంపీ పి.వి.మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. కడపలో 3వ డివిజన్ అభ్యర్థిని దారిలోనే అడ్డుకుని నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేశారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏకంగా 9 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను (వార్డు నెంబర్లు 1, 4, 9, 10, 13, 19, 55, 59, 65) నామినేషన్ కేంద్రాల గదిలోకి వెళ్లకుండా భౌతికంగా అడ్డుకున్నారు. ఈ ఘటనలకు సంబంధించి బాధిత అభ్యర్థులు (ఎన్. కుప్పయ్య, పి.సాయి ప్రసన్న కుమార్, ఈ. అనిల్ కుమార్ రెడ్డి తదితరులు) స్వయంగా ధ్రువీకరిస్తూ ఇచ్చిన అఫిడవిట్లను సుప్రీంకోర్టుకు సాక్ష్యాలుగా సమరి?పంచారు. తాడిపత్రిలో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వబోనని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి బహిరంగ బెదిరింపులకు పాల్పడిన విషయాన్ని కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకుని వస్తున్నాం.

### ఎస్‌ఈసీకి ముందే చెప్పినా చర్యల్లేవు

ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే సెపట?టంబర్ 4, అక్టోబర్ 9, అక్టోబర్ 16 తేదీల్లో ఎస్‌ఈసీకి వైఎస్సార్‌సీపీ పలుమార్లు వినతులు సమరి?పంచింది. కేంద్ర బలగాలను మోహరించాలని, జిల్లా కలెక్టరేట్లలో ప్రత్యామ్నాయ నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల నిఘా ఉంచాలని కోరింది. అయితే అవాంఛనీయ ఘటనలు జరిగిన తర్వాత కూడా అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు లేవు.

### సుప్రీంకోర్టుకు అభ్యర్థనలు

అక్టోబర్ 18న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన అప్పీల్‌ను స్వీకరించాలి.

అభ్యర్థులను అడ్డుకున్న సదరు పట్టణ స్థానిక సంస్థల్లో ఏ ఒక్క అభ్యర్థినీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే ప్రక్రియను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలిపివేస్తూ స్టే విధించాలి.

ఈ పిటిషన్ పరిష్కారం అయ్యే వరకు నామినేషన్ల దాఖలుకు తగినంత గడువును పొడిగించేలా 4వ ప్రతివాదిని (రాష్ట్ర ఎన్నికల సంఘం) ఆదేశించాలి.

అభ్యర్థులు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ కోసం అదనపు, ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఏర్పాటుచేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలి. ఈ నామినేషన్ల ప్రక్రియ అంతటినీ తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయాలి.

పొడిగించిన గడువు సమయంలో నామినేషన్ కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులకు, వారిని ప్రతిపాదించే వారికి మార్గమధ్యలోనూ, కేంద్రాల వద్ద ఎలాంటి ఆటంకాలు లేకుండా తగిన పోలీసు రక్షణ కల్పించేలా ప్రతివాదులు 3, 7 (హోంశాఖ, డీజీపీ)లను ఆదేశించాలి.

భౌతికంగా అడ్డుకున్నారని ప్రమాణపూర్వక అఫిడవిట్లు సమర్పించిన అభ్యర్థులతో పాటు, అదే విధమైన పరిస్థితులను ఎదుర్కొన్న ఇతర అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలను ‘నామినేషన్ పొడిగింపు సమయంలో’ తప్పనిసరిగా స్వీకరించేలా ఆదేశాలు ఇవ్వాలి.

పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పై విజ్ఞప్తుల అమలు కోసం అత్యవసరంగా ఎక్స్--పార్టీ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలి.

నామినేషన్ కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు/వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి ప్రత్యక్ష ప్రసారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం నేరుగా పర్యవేక్షించేలా చూడాలి.

నామినేషన్ల స్వీకరణకు ఆటంకం కలిగించిన ఘటనలపై జిల్లా ఎన్నికల అధికారుల నుంచి తక్షణ రిపోర్ట్ తెప్పించుకోవాలి. అభ్యర్థులను అడ్డుకున్న వ్యక్తులపై, నామినేషన్లు స్వీకరించని అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి.

కేసు వాస్తవాలు, పరిస్థితులకు అనుగుణంగా న్యాయస్థానం ఇతర తగిన ఉత్తర్వులైనా జారీ చేయాలి.

# రేషన్ షాపుల్లో గోధుమ పిండి, నిత్యావసరాలు!

(మొదటి పేజీ తరువాయి)

భరోసా కల్పిస్తూ 14నెలల అవసరాలకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పేద కుటుంబాలపై ధరల భారాన్ని తగ్గించేందుకు రేషన్ షాపుల ద్వారా గోధుమపిండి, ఎంపిక చేసిన నిత్యావసరాలు (కందిపప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం) అందించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం ఎంత ఖర్చవుతుందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు సచివాలయంలో సోమవారం తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాబోయే సీజన్లలో వర్షపాతం తగ్గినా రేషన్ సరఫరాకు అంతరాయం కలగకుండా ధాన్యం సేకరణ, బియ్యం నిల్వల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర సంక్షేమ పథకాలకు కలిపి నెలకు 2.38 లక్షల టన్నుల బియ్యం అవసరం ఉందని, ఏడాదికి 28.56లక్షల టన్నులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

అక్టోబరు 16 నాటికి రాష్ట్రంలోని బఫర్ గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్), ఇతర గుర్తించిన సరఫరాల ద్వారా మరో 18.39లక్షల టన్నుల బియ్యం అందాల్సి ఉందని పేర్కొన్నారు. 2027 సెప్టెంబరు వరకు ఈ బియ్యం సరిపోతాయని వివరించారు. ఈ మేరకు ఉత్తమ్ స్పందిస్తూ.. మిల్లర్లు, ఇతర వనరుల నుంచి రావాల్సిన బియ్యం నిర్ణీత గడువులోగా గోదాములకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# పండగ వేళ ఆర్టీసీ టికెట్ ధరల్ని రెట్టింపు చేశారు

(మొదటి పేజీ తరువాయి)

సమయాల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా టికెట్ ధరల నియంత్రణ, నిర్ణయాలు 2003 సంవత్సరానికి చెందిన జీవో ఆధారంగా నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. దసరా పండగ వేళ బస్సు సర్వీసులను తగ్గించలేదని.. ప్రత్యేకంగా 7 వేల అదనపు బస్సులను ఏర్పాటు చేశామని తెలిపింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97% సర్వీసులను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విజయవంతంగా నడిపించినట్లు వెల్లడించింది.

# ‘ఫ్యూచర్’ అభివృద్ధిలో మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

తరుణ్‌జోషి బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమం అనంతరం డీజీపీ ఆనంద్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం నరేందర్‌రెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, శాంతిభద్రతల డీజీ మహేశ్ భగవత్, ఫ్యూచర్‌సిటీ జాయింట్ కమిషనర్ చందనా దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2025 డిసెంబరులో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లను పునర్‌వ్యవస్థీకరించి కొత్తగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను సృష్టించిన విషయం తెలిసిందే. అప్పట్లో కమిషనర్ కార్యాలయాన్ని తాత్కాలికంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. తాజాగా ఆక్టోపస్ ప్రాంగణంలో కమిషనర్ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు.

# ‘ఎల్‌నినో’పై మంత్రివర్గ ఉపసంఘం

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో నిర్వహించిన సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు నిర్ణయం తీసుకొన్నారు. దానికి అనుగుణంగా తాజాగా ఉత్తర్వులొచ్చాయి. రాష్ట్రంలో ఎల్‌నినో వల్ల వర్షాభావం ఏర్పడి 331 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. పంటల విస్తీర్ణం 9 శాతం తగ్గింది. వరి సాగులో 18 శాతం లోటు ఏర్పడింది. 6,123 చెరువులు ఎండిపోయాయి. రిజర్వాయర్లలోనూ నీటిమట్టాలు పడిపోయి సాగు,తాగునీటికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మరోపక్క విద్యుత్తు డిమాండ్ భారీగా పెరిగి కోతలతో పంటలకు సరిగా నీరివ్వలేని పరిస్థితి. ప్రాథమికంగా రూ.20 వేల కోట్ల వరకు నష్టం ఉంటుందని అంచనా.

ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఈ పరిస్థితులన్నింటిపై నిరంతరం పర్యవేక్షించి అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు విధానపరమైన నిర్ణయాలకు సిఫార్సులు చేయనుంది. సాయం కోసం కేంద్రప్రభుత్వానికి పంపే నివేదికల రూపకల్పనలోనూ ముఖ్యపాత్ర పోషించనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దసరా అనంతరం మంత్రివర్గ ఉపసంఘం మొదటి సమావేశం జరగనుంది. అఖిల పక్ష సమావేశం కూడా ఉపసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.





# బైక్ వదిలి రైలులో పరారీ.. ఎలా చిక్కారంటే?

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన ముంబయిలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో నిందితుల్ని 24 గంటల్లోపే అరెస్టు చేసిన ముంబయి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుడి తుపాకీలో తలెత్తిన సాంకేతిక లోపం వల్లే నటుడు సురక్షితంగా బయటపడినట్లు పలువురు భావిస్తున్నారు. నిందితులు ఏడు రౌండ్లలో కాల్పులు జరపగా.. పలు తూటాలను పోలీసులు (వీబీఎఖిఅ ్రశీశ్రీఅఎవ) స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితుల్లో ఎవరూ మైనర్లు లేరని స్పష్టం చేశారు. ముంబయి పోలీసుల కళ్లుగప్పి కోటాకు పారిపోయిన నిందితులను ఎలా పట్టుకున్నారో డీసీపీ రాజ్‌తిలక్ రౌషన్ మీడియాకు వెల్లడించారు.

### అలా ప్లాన్ చేసి.. ఇలా చిక్కి..

ఆదివారం సాయంత్రం 7గంటల సమయంలో జుహులో బైక్‌పై ముగ్గురు రాగా.. వారిలో ఇద్దరు నటుడిపై కాల్పులు జరిపినట్లు ముంబయి డీసీపీ రాజ్‌తిలక్ రౌషన్ తెలిపారు. అనంతరం ముంబయి నుంచి సూరత్ మీదుగా కోటాకు పారిపోగా.. ఆ మార్గాన్ని గుర్తించినట్లు వివరించారు. నిందితులు తొలుత అంధేరీ వెస్ట్ సమీపంలో మోటార్ బైక్‌ను వదిలేసి.. లోకల్ ట్రైన్‌లో వెళ్లారని, అక్కడి నుంచి యాప్ ఆధారిత క్యాబ్‌లో సూరత్ వెళ్లి.. పుణె-జైపుర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారన్నారు. ఆ తర్వాత పోలీసులు వారిని కోటా రైల్వే స్టేషన్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారని వివరించారు. నిందితులు జైపూర్ నుంచి బస్సులో దిల్లీ మీదుగా నేపాల్ వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారన్నారు. ఈ దాడి తర్వాత నిందితులు పోలీసుల కళ్లుగప్పి పారిపోయేందుకు పలు రకాల రవాణా మార్గాలను ఉపయోగించుకోవాలని ప్లాన్ చేసుకున్నారని, అయితే.. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక విశ్లేషణ, క్షేత్రస్థాయి దర్యాప్తుతో ముంబయి క్రైం బ్రాంచ్ పోలీసులు వారి కదలికల్ని గుర్తించి.. రాజస్థాన్ పోలీసులను అప్రమత్తం చేయడంతో కోటా రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డారని ఈ ఘటనపై దర్యాప్తునకు 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### కాల్పుల్లో వాడిన బైక్‌పై ఆరా!

రెండు ఆయుధాలతో కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో ఇద్దరు హరియాణాకు చెందిన వారు కాగా.. ఒకరు బిహార్‌కు చెందిన వ్యక్తి ఉన్నట్లు వెల్లడించారు. కాల్పుల సమయంలో వాడిన బైక్‌కు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. ఈ బైక్‌ను సెప్టెంబర్ 11న నిందితుడు కొనుగోలుచేశాడని, అతడు ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 2022 నుంచి ఈ బైక్ నలుగురి చేతులు మారినా.. రిజిస్ట్రేషన్ బదిలీ కాలేదని పేర్కొన్నారు.

### రైల్వే స్టేషన్‌లో 15 నిమిషాల ఆపరేషన్.. కోటా ఎస్పీ

కోటా జంక్షన్‌లో ఆగనున్న రైలులో అనుమానితులు ఉండవచ్చన్న ముంబయి పోలీసుల హెచ్చరికలతో మేం అప్రమత్తమయ్యాం. కోటా జంక్షన్‌లో రైలు ఆపి అదుపులోకి తీసుకున్నాం. 15 నుంచి 20 నిమిషాల పాటు ఆపరేషన్ చేపట్టి అనుమానితులను నిర్బంధించాం. ప్రాథమిక దర్యాప్తు అనంతరం ముంబయి పోలీసులకు అప్పగిస్తాం. ముంబయి నుంచి ఇప్పటికే ప్రత్యేక బృందాలు చేరుకున్నాయి” అని కోటా ఎస్పీ తేజస్విని గౌతమ్ మీడియాకు వెల్లడించారు.

# ‘తాగి పాడుతున్నావ్ ఆపు!’.. దలేర్ మెహందీని అడ్డుకున్న మంత్రి



దేహ్రాదూన్: ప్రముఖ పంజాబీ గాయకుడు దలేర్ మెహందీకి (ఖుశ్రీవతీ వీవష్ణఅఎఖ) చేదు అనుభవం ఎదురైంది. నవరాత్రి వేడుకల్లో భాగంగా పాట ఆలపిస్తుండగా.. మంత్రి ఆయన్ను అడ్డగించారు. మద్యంమత్తులో పాడుతున్నావంటూ పాడొద్దని సూచించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో జరుగుతున్న ఉత్సవాలకు దలేర్ మెహందీ హాజరయ్యారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాట ఆలపిస్తుండగా.. నరేంద్రనగర్ ఎమ్మెల్యే, ఉత్తరాఖండ్ మంత్రి సుబోధ్ ఉనియాల్ నేరుగా వేదికపైకి వెళ్లి దలేర్ మెహందీ పాటను ఆపేశారు.“నవరాత్రుల సందర్భంగా దుర్గామాత కోసం ఏర్పాటు చేసిన పవిత్ర కార్యక్రమం ఇది. ఇలాంటి చోట మీరు మద్యం తాగి పాడటం ఏమాత్రం సరికాదు” అంటూ గాయకుడిపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. వేదిక పవిత్రతను, మర్యాదను కాపాడాలని గాయకుడిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే, “దయచేసి వేదికను వీడండి” అంటూ దలేర్ మెహందీ రెండు చేతులు జోడించి మంత్రికి విజ్ఞప్తి చేయడం కనిపించింది. “సరిగా మాట్లాడలేకపోతున్నావ్.. ఏం పాడతావ్” అంటూమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాసేపటి తర్వాత మంత్రి స్టేజీని వీడారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతోంది. మంత్రి ఆరోపణలపై దలేర్ మెహందీ గానీ, ఆయన టీమ్ గానీ వివరణ ఇవ్వలేదు.

# ముంచుకొచ్చిన మూడో ముప్పు!

కుకీలు, మైతేయిల ఘర్షణలతో మండుతున్న మణిపుర్‌లో మూడో ముప్పు ముంచుకొచ్చింది. నాగాల రూపంలో వచ్చిన ఈ ప్రమాదంతో మరిన్ని కొండ ప్రాంతాలకు హింస విస్తరించింది. మారణ హోమానికి దారితీస్తోంది. ఒక్క సెప్టెంబరు నెలలోనే 19 మంది మరణించారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెలలోనూ భారీగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం ఒక్కరోజే నలుగురు మరణించారు. 2023 మే 3వ తేదీన ప్రారంభమైన అల్లర్లు ఇప్పటికీ మణిపుర్‌లో మారణ హోమాన్ని సృష్టిస్తున్నాయి. తొలుత కుకీ-మైతేయిల మధ్య ఘర్షణలు జరగ్గా.. ఇప్పుడు కొండ ప్రాంతాల్లో కుకీలు, నాగాల మధ్య పరస్పర దాడులు చోటుచేసుకుంటున్నాయి.ఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబరు 10 మధ్య 100 మంది మరణించారు. 300 హింసాత్మక ఘటనలు జరిగాయి. ప్రస్తుతం లోయ ప్రాంతమైన ఇంఫాల్ కొంత ప్రశాంతంగా ఉండగా.. కొండ ప్రాంతాలైన ఉఖ్రుల్, కామ్‌జోంగ్, కాంగ్‌పోక్పి, నోనీ, తమెంగ్‌లాంగ్, సేనాపతి వంటి కొండ ప్రాంత జిల్లాల్లో హింస ప్రజ్వరిల్లుతోంది. ఈ నెలలో అక్టోబరు మధ్య నాటికే 13 మంది మరణించారు. సోమవారం మరో నలుగురు చనిపోయారు.నాగాలు రోడ్ల దిగ్బంధాన్ని ఆయుధంగా మలుచుకుంటున్నారు. జూన్ నుంచి వారు పలు రోడ్లను దిగ్బంధించారు. పలు దఫాల చర్చల అనంతరం సెప్టెంబరు 26న వారు దానిని ఎత్తివేశారు.2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రెండు కుకీ గ్రూపుల మధ్య కార్యకలాపాల నిలిపివేత (ఎస్‌ఓఎస్) ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందాన్ని కుకీ గ్రూపులు ఉల్లంఘిస్తున్నాయని నాగా సంస్థలు ఆరోపిస్తున్నాయి. మే, సెప్టెంబరు మధ్య 5 భారీ దాడులు జరిగాయని వెల్లడించింది. అయితే కుకీలు దానిని తిరస్కరించారు. కానీ దాడులకు బాధ్యులెవరనేది ప్రభుత్వం తేల్చలేదు.

# జర్నలిస్టులపై దాడి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యులుగా తేలిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీకి టీఎంఎస్‌పీజెఏ రాష్ట్ర అధ్యక్షుడు కుడుతాడి బాపురావు వినతి

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) అక్టోబర్ 19**



గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు జర్నలిస్టులు పోతూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టి సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మీడియం స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టిడబ్ల్యూజేఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడారు. వార్తా కథనాలు ప్రచురించారనే కారణంతో జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని శారీరకంగా హింసించారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నించడం, ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం తమ వృత్తిలో భాగమని తెలిపారు. వార్తా కథనాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో స్పందించాలే తప్ప, భౌతిక దాడులు లేదా వేధింపులకు పాల్పడటం సమర్థనీయం కాదన్నారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, పౌరుల హక్కులు, ప్రజాస్వామ్య విలువలకు సంబంధించిన కీలక అంశమని పేర్కొన్నారు. పోలీసులపై వచ్చిన ఆరోపణలను తేలికగా తీసుకోకుండా, బాధితుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న వైద్య నివేదికలు, సంబంధిత రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. విచారణ ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా సాగాలని స్పష్టం చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే విచారణకు ఆదేశించి, వేములవాడ డీఎస్పీని విచారణ అధికారిగా నియమించడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్‌ను ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసి, అనంతరం సస్పెండ్ చేయడం స్వాగతించదగ్గ చర్యలని బాపురావు పేర్కొన్నారు. అయితే, ప్రాథమిక చర్యలతోనే వ్యవహారం ముగియకూడదని, విచారణలో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు తమ వృత్తి నిర్వహణలో భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణాన్ని పోలీసు యంత్రాంగం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, వేధింపులు చోటుచేసుకోకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించారు. వార్తా కథనాల్లో తప్పులు ఉన్నాయని భావిస్తే వివరణ కోరడం, ఖండన ఇవ్వడం, చట్టబద్ధమైన పరిష్కారాలను ఆశ్రయించడం వంటి మార్గాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని బాపురావు జిల్లా ఎస్పీని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల హక్కులకు రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారని ఈ విషయంపై విచారణ కొనసాగుతుందని విచారణ అనంతరం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె కరుణాకర్ రావు, వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు బొప్ప బిక్షపతి, కార్యదర్శి గొల్లపల్లి వేణు, జిల్లా నాయకులు కొప్పుల ప్రసాద్, నారు కట్ల మధు, టీఎంఎస్‌పీజెఏ రాష్ట్ర నాయకులు మిట్టపల్లి సురేందర్ తదితరులు ఉన్నారు.

## సీజేపీ నేతల కస్టడీ పొడిగింపు

కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నాయకులు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక ఎగ్జిక్యుటివ్ మెజిస్ట్రేట్ మరో రెండు రోజులు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. వారి విడుదల కోసం సీజేపీ న్యాయబృందం పూచీకత్తులను సమర్పించిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. తదుపరి విచారణను ఈనెల 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. దాస్, రాంకాలను జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలని కోరుతూ సీజేపీ న్యాయ బృందం స్పెషల్ ఎగ్జిక్యుటివ్ మెజిస్ట్రేట్ ముందు ఒక దరఖాస్తును దాఖలు చేసింది.







## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా దసరా వేడుకలు

ఆయుధ, జమ్మి, వాహన పూజల్లో పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 19**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆయుధ పూజ, జమ్మి పూజ, వాహన పూజ కార్యక్రమాల్లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు నింపాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జానీమియా, శ్రీధర్ రెడ్డి, కిరణ్ కుమార్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రూప్రైటర్ : ఎం. రమేష్
ఫోన్ : 9502120421






# కోయగూడెం ఓసీలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్-6

**(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 19**




కోయగూడెం ఓసీలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్--6 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్విరాన్‌మెంట్ అధికారి నరసింహారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా కేవైసీ పీవో మాధవరావు, డీజీఎం (పర్సనల్) అజ్మీర తుకారాం పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మనం పనిచేసే కార్యాలయాలు, గనులు, పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పని ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, పొదలు పెరగడం, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల పాములు, విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.దీనివల్ల కార్మికులు, ఉద్యోగుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల పొదలను తొలగించి, స్ట్రాప్‌ను క్రమపద్ధతిలో నిల్వ ఉంచి, పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని తెలిపారు.వినియోగంలో లేని కంప్యూటర్లు, చిప్స్‌తో పాటు ఇతర ఈ-వేస్ట్, వ్యర్థ పదార్థాలను నిర్లక్ష్యంగా పడవేయకుండా, వాటిలోని అవసరమైన డేటాను భద్రపరిచి, అనంతరం నిబంధనల ప్రకారం స్ట్రాప్ యార్డుకు తరలించాలని సూచించారు.స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేఓసీ మేనేజర్ శ్రీనివాస్, అరుణ్ దినకర్, కే.వెంకటేశ్వర్లు,ఇతర అధికారులు, యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# సాగునీరు అందక రైతు ఆత్మహత్య

## శంకరపట్నం మండలం కరీంపేటలో విషాదం

**(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 19**



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో రైతు నాంపల్లి సాంబయ్య ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో సాంబయ్య పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు సమాచారం.

### ఐదెకరాల్లో వరి సాగు

సాంబయ్య తనకున్న ఐదెకరాల్లో వరి పంట సాగు చేయగా, పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆదివారం గ్రామస్థులతో కలిసిమెలిసి ఉన్న ఆయన, అర్ధరాత్రి సమయంలో పొలం వద్దకు వెళ్లి లుంగీతో ఉరివేసుకున్నట్లు పేర్కొన్నారు.

### పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

రైతు మృతికి సంబంధించిన పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.



# నిజాయితీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికుడు రాజేష్

## కోరుట్ల అక్టోబర్19 ప్రజాతీర్పు

విధుల నిర్వహణలో ఓ పారిశుద్ధ్య కార్మికుడు తన నిజాయితీని చాటుకుని పలువురి ప్రశంసలు అందుకున్నారు.స్థానిక ఆదర్శనగర్ నుంచి మెయిన్ రోడ్డు మార్గంలో సోమవారం ఉదయం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండగా, మున్సిపల్ కార్మికుడు మహంకాళి రాజేష్‌కు రోడ్డుపై ఓ ఖరీదైన సెల్ ఫోన్ దొరికింది. దానిని స్వార్థంతో దాచుకోకుండా, వెంటనే మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఎస్.ఐ) అశోక్‌కు సమాచారం అందించారు.అనంతరం ఆ ఫోన్‌ను మున్సిపల్ కార్యాలయ మేనేజర్ శ్రీనివాస్‌కు అప్పగించారు.ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర దృష్టికి తీసుకెళ్లగా, ఫోన్ డేటా ఆధారంగా యజమాని వివరాలు కనుగొని రప్పించారు.కమిషనర్ ఆదేశాల మేరకు కార్యాలయంలో సదరు యజమానికి ఫోన్‌ను భద్రంగా అందజేశారు.రోడ్డుపై పోగొట్టుకున్న ఫోన్ తిరిగి దక్కడంతో యజమాని మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిబద్ధతతో, నిజాయితీగా వ్యవహరించిన పారిశుద్ధ్య కార్మికుడు మహంకాళి రాజేషును కమిషనర్ రాఘవేంద్రతో పాటు కార్యాలయ సిబ్బంది, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.



# దుర్గామాత ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి

**( కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) అక్టోబర్ 19.**

జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ దుర్గామాత మండపాలను సందర్శించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని, రైతులకు మంచి దిగుబడులు లభించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్లినో ప్రభావం త్వరగా తొలగిపోయి, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత కృపతో జగిత్యాల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది మరింత సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య ఏ ఎం సి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి కౌన్సిలర్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ

## అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలను స్మరించుకున్న నాయకులు

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )అక్టోబర్19**


జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, సాతల్ల లక్ష్మణ్, సిరికొండ తిరుపతి, వేల్పుల రాజేష్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ జేఏసీ చైర్మన్, జగిత్యాల జిల్లా నాయకుడు, అంబేద్కర్ అవార్డు గ్రహీత ఎనగంటి రాజేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ చేసిన సేవలను, ఆయన ఆశయాలను, ఆలోచనలను, సమాజం కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, ఆత్మగౌరవం పెంపొందించేందుకు అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ, ఆయన కలలుగన్న సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు “జై భీమ్.. జై జై భీమ్” నినాదాలతో అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు కొండ్ర తిరుపతి,జిల్లా డిసిసి కార్యదర్శి తడగొండ విజయ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెవులమద్ది రమేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైరిపోతుల నరేష్, చేనేత మండల ఐక్య వేదిక అధ్యక్షులు పెద్దూరి కుమారస్వామి,బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు జేరిపోతుల కొమరయ్య,చెవుల మద్ది గంగాధర్, గంగాధర ఆశయ్య,చెవుల మద్ది హరీష్,తదితరులు పాల్గొన్నారు.

# ఈ విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి

**( కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 19.**



విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలత, విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరినారు.



# రూ.2 లక్షల ఎల్వోసీ అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్...

**( కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) అక్టోబర్ 19.**

రాయికల్ పట్టణానికి చెందిన బి. మౌనిక (అల్లిపూర్)గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ, చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గారి దృష్టికి తీసుకురాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ వెంటనే స్పందించి, సీఎం సహాయనిధి ద్వారా మౌనిక చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించి సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మౌనిక కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల విలువైన సీఎం సహాయనిధి ఎల్వోసీని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గారు అందజేశారు. ఈ సందర్భంగా మౌనికా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వెంట నాయకులు సమిండ్ల శ్రీనివాస్,గంగాధర్,జహంగీర్,తదితరులు ఉన్నారు.

# జేకే 5 ఓసీ శ్రీ దుర్గా భవాని మాత ఆలయంలో ఘనంగా మహా చండీ యాగం

**(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) అక్టోబర్ 19**



సింగరేణి ఏరియాలోని జేకే 5 ఓసీ శ్రీ దుర్గా భవాని మాత ఆలయంలో దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా చండీ యాగం, ప్రత్యేక పూజలు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు ఏరియా జీఎం వి. కృష్ణయ్య దంపతులు మహా చండీ యాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు అనంతరం శ్రీ దుర్గా భవానిమాతకు ప్రత్యేక పూజలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. తదనంతరం నిర్వహించిన మహా అన్న ప్రసాద వితరణ (సహపంక్తి భోజనాలు) కార్యక్రమంలో ఏరియా అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జాకీర్ హుస్సేన్, కేఓసీ పీవో మాధవరావు, డీజీఎం ఐడీ ప్రభాకర్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామదాసు తదితర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

## ఎస్పీ మహేష్ బి.గితే.

**(బుగ్గ కృష్ణమూర్తి ప్రజా తీర్పు, సిరిసిల్ల) అక్టోబర్ 19**



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 13 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ప్రజావాణి సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు సిరిసిల్ల) అక్టోబర్ 19**



ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు,.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 35 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయం, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు రాలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓ లు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..

బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 0 , చందుర్తి మండలం 01 , ఇల్లంతకుంట మండలం10 , గంభీరావుపేట మండలం 04 , కోనరావుపేట మండలం 0 , ముస్తాబాద్ మండలం 0, రుద్రంగి మండలం,0 తంగళ్లపల్లి మండలం 01, వీర్నపల్లి మండలం 0, వేములవాడ అర్బన్ మండలం 0, వేములవాడ రూరల్ మండలం 01, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి దరఖాస్తులు రాలేదు.

### మండల, డివిజన్ స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు.ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించి ప్రతిభ చాటిన తేజస్ కుమార్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఘనంగా సన్మానించారు

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి), అక్టోబర్ 19**



జూనియర్ నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 1 రజతం, 2 కాంస్యాలు మరియు ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో 1 కాంస్యం సాధించినందుకు ఎంఎల్ఆర్ గ్రూప్ చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తేజస్ కుమార్‌ను అభినందించారు. క్రీడాకారుడు భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తెవాలని ఆకాంక్షించారు. తేజస్ విజయాలు తోటి యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.



# నిర్మల్ పోలీస్... మీ పోలీస్

- దసరా నవరాత్రుల వేళ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో వైభవంగా ఆయుధపూజ
- ఆయుధ పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,19 అక్టోబర్ (ప్రజాతీర్పు ):**

దసరా నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పాల్గొని పోలీస్ ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ వాహనాలకు వాహనపూజ చేశారు. జిల్లా ఎస్పీ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దసరా నవరాత్రులలో భాగంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆయుధపూజ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. పోలీస్ శాఖలో ఆయుధాలు, వాహనాలు విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు దసరా, నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలతో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, అక్టోబర్ 19, (ప్రజా తీర్పు ప్రతినిధి):**



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ సందర్భంగా సూచించారు.



# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజ

**మెదక్, అక్టోబర్ 19ప్రజా తీర్పు ప్రతినిధి):**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పాల్గొని ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, పోలీసు అధికారులు, సిబ్బందికి జమ్మి ఆకులను అందజేస్తూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పోలీసు వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆయుధ పూజ అనేది మన సంప్రదాయాలకు ప్రతీక అని, విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాహనాల పట్ల గౌరవం, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, అప్రమత్తత, వృత్తిపరమైన నిబద్ధతను పాటించాలని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధిని అందించాలని ఆకాంక్షించారు. పోలీసు అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు రాజశేఖర్ రెడ్డి, జర్జ్, కృష్ణ మూర్తి రామకృష్ణ, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా తీర్పు కథనానికి స్పందన

## ఫారెస్ట్ అధికారి సస్పెండ్

**నర్సంపేట రూరల్, అక్టోబర్ 19, ప్రజా తీర్పు ప్రతినిధి:**

లంచాల మత్తులో ఫారెస్ట్ అధికారులు అంటూ ప్రజా తీర్పు దినపత్రికలో 01-10-2026న ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. నర్సంపేట అటవీ క్షేత్రాధికారి (రేంజర్) కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలు, పోడు భూముల్లో బోర్లకు లంచాల దందా పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి సంబంధిత ఫారెస్ట్ అధికారిని సస్పెండ్ చేశారు. ఈ విజయం వెనుక పేదల పక్షాన నిత్యం పోరాడే బానోతు లక్ష్మణ్ నాయక్ చేసిన కృషి ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోడు రైతులను పీడిస్తున్న అధికారుల తీరును బయటపెట్టి, ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితంగానే చర్యలు తీసుకున్నారని స్థానిక రైతులు, గిరిజన ప్రజలు అభినందిస్తున్నారు. పేద ప్రజల గొంతుకగా నిలిచిన లక్ష్మణ్ నాయక్ పోరాటానికి దక్కిన న్యాయమని కొనియాడుతున్నారు.

# వెట్టి చాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- కార్మికుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి
- 'స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19 (ప్రజాతీర్పు ):**



వెట్టి చాకిరి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే ఈ ప్రచార రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టి చాకిరికి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర నిఘా కొనసాగించాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,19 అక్టోబర్ (ప్రజాతీర్పు ):**



జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం నిర్మల్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పి. శ్రీనివాస్ పూల మొక్కను అందజేసి స్వాగతం పలకగా, ఎస్పీ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం కార్యాలయ రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. గ్రేవ్, పోక్సో కేసులతో పాటు దర్యాప్తులో ఉన్న, పెండింగ్‌లో ఉన్న, ట్రయల్ దశలో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను సమీక్షించి, నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి కేసులో ఎస్ఓపీ పాటించాలని డీఎస్పీ పి. శ్రీనివాస్ కు సూచించారు. కార్యాలయంలో 5ూ విధానాన్ని అమలు చేస్తూ ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, పోలీస్ స్టేషన్లను తరచుగా తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. రౌడీషీటర్లు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని డీఎస్పీకి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, సత్యనారాయణ, కృష్ణ, ఎస్ఐ లింబాద్రి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# స్కూల్ కాంపౌండ్ పక్కన ఉన్న కల్లు కల్లు దుకాణంని తరలించండి. ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు

- సోమవారం జరిగిన ప్రజావాణిలో ఒక దరఖాస్తు మాత్రమే వచ్చింది . ఎంపీ ఓ నరేష్

**(వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) అక్టోబర్ 19**

మెదక్ జిల్లా నర్సాపూర్ నర్సాపూర్ నియోజకవర్గం మాసాయిపేట మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో అందరూ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అందులో ఒక అప్లికేషన్ ఎక్సజ్ శాఖకు కార్యాలయమునకు రావడం జరిగింది. మాసాయిపేట గ్రామంలో నివాసాల మధ్య పాఠశాలకు దగ్గరగా ఉన్న కళ్ళు దుకాణాన్ని తక్షణమే మార్చవలసిందిగా మాసాయిపేట ప్రజల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కల్లు దుకాణం అక్కడ ఉండడంవల్ల ఎమ్మార్వో,ఎంపీడీవో ఆఫీస్ కి దగ్గర, స్కూల్ విద్యార్థులకు, గ్రామ మహిళలకు ఇబ్బందికరంగా మారిందని తక్షణమే ఊరి అవతల తరలించాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీ ఓ నరేష్ తొందర్లోనే పరిష్కార మార్గం చూపిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.



# చలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయాలి

## కార్మికులు, ఉద్యోగులు భారీగా తరలిరావాలి: సీఐటీయూ

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజా తీర్పు-తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 19**

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ హైవే రోడ్డు బ్రిడ్జి కింద 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కనీస వేతనాలు, స్కీం వర్కర్ల సమస్యలు, కార్మిక హక్కులు తదితర అంశాలపై తమ సంఘం పోరాటం చేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే చలో హైదరాబాద్ ధర్నా ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ నెల 25న పారిశ్రామిక రంగ కార్మికులు, సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పాల్గొననుండగా, 26న స్కీం వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్థానిక సంస్థలు, యూనివర్సిటీలు, వైద్య రంగ ఉద్యోగులు, పెన్షనర్లు, బీడీ, బిల్డింగ్, రవాణా, హమాలీ కార్మికులతో పాటు వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ ధర్నాకు కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రగిరి తిరుపతి, చదువుల రవీందర్, మేడి ఎల్లయ్య, తన్నీరు శ్రీను, ధరణి బుచ్చయ్య, షబ్బీర్, తవనవేని శ్రీను, ఉడ్నాల చందు, శివతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.ఈ రూపంలో పేపర్ న్యూస్‌కు సరళంగా, వార్తా భాషలో ఉంటుంది.

# జమ్మికుంటలో ఘోర అగ్నిప్రమాదం..

## విజయలక్ష్మి జ్యువెలర్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

**జమ్మికుంట, అక్టోబర్ 19 ప్రజాతీర్పు**




జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక విజయలక్ష్మి జ్యువెలర్స్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా స్పందించిన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అయితే మంటల తీవ్రతకు భవనంలోని పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4 నుండి 5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు షాప్ యజమానులు కాసుల కిరణ్, మహేష్ తెలిపారు.

# అమ్మవార్లకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన.. జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**జక్కుల శ్రీకాంత్,కరీంనగర్, (ప్రజా తీర్పు ప్రతినిధి).అక్టోబరు 19**



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం సోమవారం నగరంలోని పలు దుర్గామాత ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కాంగ్రెస్ నాయకులతో కలిసి నగునూర్‌లో ని దుర్గామాత ఆలయాన్ని సందర్శించి అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చైతన్యపురిలోని మహాశక్తి ఆలయానికి చేరుకుని దుర్గామాత, సరస్వతీ మాత, మహాలక్ష్మి అమ్మవార్లకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం కార్యక్రమాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దేవి నవరాత్రుల పర్వదినాల్లో అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. చొప్పదండి నియోజకవర్గ ప్రజలతో పాటు కరీంనగర్ జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలు తలపెట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని, వారి ఆకాంక్షలు, కోరికలు నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు పేర్కొన్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతనోత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు, కరీంనగర్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల చైర్మన్లు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కోల రమేష్, కాంగ్రెస్ నాయకులు పులి ఆంజనేయులు గౌడ్, వరాల నర్సింగం, ముత్యం శంకర్, జవ్వాజి హరీష్, అన్నమనేని నరసింహారావు, వంశీ గౌడ్, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత అమ్మవార్ల దర్శనంలో యూఫ్ టీవీ అధినేత పాడి ఉదయానంద రెడ్డి

- సుమారు 25 దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు
- ప్రతి మండపానికి రూ. 5,000 ఆర్థిక సాయం అందజేత
- గ్రామీణ విద్యార్థుల కోసం ఏఐ, త్రిపుల్ ఐటీ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం



**జమ్మికుంట, అక్టోబర్ 19 ప్రజాతీర్పు**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా యూఫ్ టీవీ అధినేత పాడి ఉదయానంద రెడ్డి జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆబాది జమ్మికుంట, కృష్ణ కాలనీ, కౌండిన్య యూత్, మేదరివాడ, హౌసింగ్ బోర్డ్, దుర్గా కాలనీలతో పాటు గత 25 ఏళ్లుగా అమ్మవారిని ప్రతిష్టిస్తున్న సుభాష్ యూత్ మండపాన్ని ఆయన దర్శించుకున్నారు. అలాగే మోత్కులగూడెం, ధర్మారం, రామన్నపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దాదాపు 25 దుర్గామాత విగ్రహాల వద్ద ఉదయానంద రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి మండప నిర్వహణ కమిటీకి ఆయన రూ. 5,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు అత్యంత గొప్పవని, గ్రామాల్లో సంస్కృతికి అనుగుణంగా పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.

### ఏఐ సాంకేతిక రంగాల్లో శిక్షణ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పాటు త్రిపుల్ ఐటీ వంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం త్వరలోనే ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో ఏఐ ప్రభావంతో రోబోల ద్వారా వ్యవసాయం, వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత శస్త్రచికిత్సలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట, హుజురాబాద్, కమలాపూర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల సౌకర్యార్థం తన వంతు సహాయంగా ఏఐ సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు తగిన చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.పాడి ఉదయానంద్ రెడ్డికి ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



## మహిషాసురమర్దిని అవతారంలో కనకదుర్గమ్మ దర్శనం

తంగళ్లపల్లి, కిష్టంపేట్‌లో నవరాత్రి ఉత్సవాలు

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజా తీర్పు**

**తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 19**

తాండూర్ మండలం తంగళ్లపల్లి--కిష్టంపేట్ గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ కనకదుర్గ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం (అక్టోబర్ 19) అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళలు మంగళహారతులతో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరారు.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## అశాస్త్రీయ స్పీడ్ బ్రేకర్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్‌కు అన్నెమల్ల సురేష్ వినతి – నగరవ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్



**(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 19**

కరీంనగర్ నగరం లోని రహ దారులపై నిబంధనలకు విరు ద్ధంగా ఏర్పాటు చేసిన అశాస్త్రీయ స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొం టున్నారని సామాజిక కార్యకర్త, కార్పొరేటర్ అభ్యర్థి అన్నెమల్ల సురేష్ పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో అసౌకర్యానికి గురవుతున్నారని, ఇలాంటి స్పీడ్ బ్రేకర్ల వల్ల మెడ, నడుము నొప్పులు వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సమస్యపై గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ, స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతాల వివరాలను అందించాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కోరినట్లు సురేష్ వెల్లడించారు. అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న స్పీడ్ బ్రేకర్లను గుర్తించడం కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్వయంగా సమగ్ర సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను గుర్తించి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్లు, భవనాల శాఖ జారీ చేసిన సర్క్యులర్ మెమో నం.71/జుచీజ-ుజ/ూ/ణజుజు/ూజుజు2/2015, తేదీ 24-01-2015లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాలు ఉన్నాయని సురేష్ గుర్తుచేశారు. సంబంధిత నిబంధనలు, ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై తాజాగా జిల్లా కలెక్టర్‌కు మరోసారి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. నగరవ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించి, అనధికారికంగా లేదా అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు వెల్లడించారు. ప్రజల రహదారి భద్రతకు సంబంధించిన ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సురేష్ విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించని పక్షంలో, అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను పరిశీలించి, అవసరమైతే ఈ అంశాన్ని సుప్రీంకోర్టు రహదారి భద్రత కమిటీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొండి అరుణ్, సాయి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఏడుపాయల వనదుర్గమ్మను దర్శించుకున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు.

**పాపన్నపేట/మెదక్, అక్టోబర్ 19 (ప్రజా తీర్పు ప్రతినిధి):**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు.కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా ఏడుపాయల వనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చనలో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. వనదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, ప్రజల జీవితాల్లో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రభుత్వ ఉద్యోగిపై దర్యాప్తునకు అనుమతి అక్కర్లేదు'

లంచం డిమాండ్ చేశాడని ప్రభుత్వ ఉద్యోగిపై వచ్చే ఆరోపణలపై అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరపడానికి ముందస్తు అనుమతి అవసరంలేదని సుప్రీంకోర్టు తెలిపింది. అటువంటి చర్య అధికారిక విధుల నిర్వహణకు సంబంధించినది కాదని, అందువల్ల ముందస్తు అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. తనపై అవినీతి అభియోగాన్ని నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాజస్థాన్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్ తేజారామ్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీ, జస్టిస్ యూఎన్‌వీ అంజరియాతో కూడిన ధర్మాసనం ఈనెల 16న తీర్పు వెలువరించింది. ధర్మాసనం తరఫున జస్టిస్ అంజరియా తీర్పును వెలువరిస్తూ అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7 కింద తేజారామ్‌పై అభియోగాన్ని నమోదు చేస్తూ విచారణ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి రాజస్థాన్ హైకోర్టు నిరాకరించడాన్ని సమర్థించారు.



## భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటం

- రాష్ట్ర ఎన్ హెచ్ ఎం జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ టి భరత్ కుమార్

**వరంగల్ జిల్లా, అక్టోబర్ 29, ప్రజా తీర్పు ప్రతినిధి:**

వరంగల్ నగరంలోని పోచం మైదాన్ జంక్షన్ లో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం 7 వ రోజుకు చేరుకుంది. ఈ ఈ శిబిరంలో డాక్టర్.భరత్ కుమార్ మాట్లాడుతూ... ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను నిరసన కార్యక్రమం చేపట్టింది కేవలం ఆత్మగౌరం కోసం మన ఉద్యోగ భద్రత కోసం మన పిల్లల భవిష్యత్ కోసం చేస్తున్న పోరాటం అని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాలని మన న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం లభించాలని కోరుకుంటూ మన నిరసనను శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వానికి తెలియజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిఓ అర్చన, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ రవీందర్, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్, తీగల సతీష్ కుమార్, డాక్టర్ హుస్సేన్, వీసీ సీఎం రవీందర్, డైక్ మేనేజర్ మెరుగు అనిల్ కుమార్, సుల్తానా, మంజుల, ఏఎన్ఎంలు జ్యోతి, సంధ్య, అనిత , ఎం.ఎన్.ఓ.లు ఏకుల చిరంజీవి, కె. కుమార్, సపోర్టింగ్ స్టాఫ్ ,జాన్సన్ ఎండి గౌస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పూల పరిమళానికి పల్లె పరవశం!

- రేగళ్ల పెద్దతండాలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 19 ప్రజా తీర్పు**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రేగళ్ల పెద్దతండాలో పూల పరిమళాలు, మహిళల ఆటపాటల మధ్య అంబరాన్నంటింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల పెద్దతండా గ్రామంలో సర్పంచ్ లావుడ్యా పూర్ణ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబురాలను గ్రామ పంచాయతీ ఆవరణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు, సామూహిక నృత్యాలతో గ్రామ పంచాయతీ ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది.

### పూల పండుగలో తెలంగాణ సంప్రదాయాల సందడి

ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి, వాటిని అందంగా పేర్చి బతుకమ్మలను సిద్ధం చేయడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అలంకరించిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళలంతా బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ గీతాలను ఆలపిస్తూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు పండుగలో భాగస్వాములై ఆనందాన్ని పంచుకున్నారు. పూల అందాలు, మహిళల చిరునవ్వులు, సంప్రదాయ పాటలతో రేగళ్ల పెద్దతండాలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, తరతరాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక వారసత్వానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలిచింది. పల్లె ప్రజలందరూ కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ సందడి వెల్లివిరిసింది.



### సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి: సర్పంచ్ లావుడ్యా పూర్ణ

ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్యా పూర్ణ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాంటి సామూహిక వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు గ్రామ ప్రజల మధ్య సోదరభావాన్ని, ఆత్మీయతను మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూనే మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### గ్రామ ఐక్యతను చాటిన బతుకమ్మ సంబురాలు

రేగళ్ల పెద్దతండాలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామ మహిళల్లో ఆనందోత్సాహాలను నింపాయి. పూలతో పేర్చిన అందమైన బతుకమ్మలు, సంప్రదాయ గీతాలు, కోలాటాలు, సామూహిక ఆటపాటలతో గ్రామ పంచాయతీ ఆవరణ సందడిగా మారింది. మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ సంబురాలను జరుపుకోవడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. బతుకమ్మ పండుగ అంటే కేవలం పూలతో పేర్చిన బతుకమ్మలను పూజించడం మాత్రమే కాదు. ప్రకృతిని ఆరాధించడం, మహిళల ఐక్యతను చాటడం, కుటుంబ బంధాలను బలోపేతం చేయడం, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడం కూడా ఈ పండుగలో అంతర్భాగం. రేగళ్ల పెద్దతండాలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ పల్లె సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పడంతో పాటు సంప్రదాయాల పరిరక్షణకు, గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.

## సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి

- ఆటపాటలతో సందడి చేసిన మహిళలు, యువతులు
- పూల బతుకమ్మలతో పల్లెల్లో పండుగ శోభ

**కొత్తగూడెం, అక్టోబర్ 19 ప్రజా తీర్పు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, యువతులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, సెంటర్ల వద్ద రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరిన మహిళలు, యువతులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులు సైతం ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ శోభ వెల్లివిరిసింది. పూల పరిమళాలు, మహిళల పాటలు, కోలాటాలు, ఆటలతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. అనంతరం మహిళలు ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువల వద్దకు చేరుకుని బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మలను సంప్రదాయబద్ధంగా నీటిలో నిమజ్జనం చేసి వేడుకలను ముగించారు. సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళల్లో ఐక్యతను, కుటుంబాల్లో ఆనందాన్ని నింపడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయి. గ్రామాల్లో నిర్వహించిన ఈ వేడుకలు పండుగకు మరింత వన్నె తెచ్చాయి.

## గుజరాత్‌లో విద్యుత్తు సంక్షోభం.. మోదీ స్వరాష్ట్రంలో చీకట్లు.. కోతలతో జనం అవస్థలు

ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో చీకట్లు కమ్ముకున్నాయి. తీవ్ర విద్యుత్తు సంక్షోభంతో రాష్ట్రం అల్లాడిపోతున్నది. కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, బొగ్గు కొరత, తగ్గిన పవన విద్యుదుత్పత్తి, జలవిద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన నీటి నిల్వలు తగ్గిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాపై ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతాల్లో వారానికి ఒకరోజు 8 గంటలపాటు విద్యుత్తు కోతలు విధించే చర్యలు చేపట్టింది. దీంతో పరిశ్రమల ఉత్పత్తి, దీపావళి ఆర్డర్ల సరఫరా, కార్మికుల ఉపాధిపై ఆందోళన వ్యక్తమవుతున్నది. రానున్న వేసవిలో నివాస ప్రాంతాలకూ విద్యుత్తు కోతలు తప్పకపోవచ్చన్న హెచ్చరికలు మరింత కలవరపెడుతున్నాయి.

### జ్యోతిగ్రామ్ స్కీమ్‌కూ గ్రహణం

గుజరాత్‌లోని గ్రామాలు, వ్యవసాయ ప్రాంతాల్లో ఇప్పటికే విద్యుత్తు కోతలు మొదలయ్యాయి. గ్రామాలకు 24 గంటల విద్యుత్తు సరఫరా అందించే జ్యోతిగ్రామ్ పథకం అమలు ఉన్న ప్రాంతాల్లోనూ కోతలు విధిస్తున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి.



## టేకులపల్లి పోలీసుల చొరవ:15 నెలల క్రితం పోగొట్టుకున్న మొబైల్ బాధితునికి అందజేత

**(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) అక్టోబర్ 19**

టేకులపల్లి:సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ టేకులపల్లి పోలీసులు మరో బాధితునికి అండగా నిలిచారు.15 నెలల క్రితం పోయిన మొబైల్ ఫోన్‌ను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి,సోమవారం బాధితునికిఅందజేశారు.వివరాల్లోకి వెళితే...టేకులపల్లి మండలం,9వ మైలు తండా గ్రామానికి చెందిన ధరావత్ అంజి అనే వ్యక్తి దాదాపు 15 నెలల క్రితం టేకులపల్లిలో తన మొబైల్.ఫోన్‌నుపోగొట్టుకున్నారు. దీనిపై ఆయన టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుని ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న టేకులపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై మరియు సిబ్బంది,కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోర్టల్ సహాయంతో ఆ మొబైల్ జాడనుపట్టుకున్నారు.సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి ఫోన్‌ను రికవరీ చేసి,ఈరోజు టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ధరావత్ అంజికి స్వయంగా అందజేశారు.తమ విలువైన ఫోన్ సురక్షితంగా చేతికి అందడంతో బాధితుడు ధరావత్ అంజి టేకులపల్లి పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకే క్రికెట్ టోర్నమెంట్

ఈశ్వర్ జాదవ్

**బిచ్కుంద /అక్టోబర్ 19(ప్రజా తీర్పు ):**

కామారెడ్డి జిల్లా జిల్లా గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకుడు ఈశ్వర్ జాదవ్ సోమవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మున్సిపాలిటీలోని పాలగుండం మైదానంలో నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాలు, మండలాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ తమ ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక వెనుకబడుతున్నారని ఈశ్వర్ జాదవ్ పేర్కొన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని, క్రమశిక్షణతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గ్రామీణ యువతకు క్రీడల్లో మెరుగైన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## సిద్దిపేట పట్టణం అద్దంల మెరిస్తుంది అంటే... మీరే అలంకారం..

**సిద్దిపేట అక్టోబర్ 19(ప్రజా తీర్పు )**



ఈ రోజు మున్సిపల్ కార్మికులబట్టలు పంపిణి చేయడానికి విచ్చేసిన ఎం ఎల్ ఏ హరీష్ రావు మాట్లాడుతూ, సిద్దిపేట స్వచ్ఛత వెనుక పారిశుధ్య కార్మికుల రెక్కల కష్టమే ఉంది.. కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాల్సిందే .సిద్దిపేటకు దేశంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయంటే అది తన గొప్పతనం కాదు.. చలిని, వానను లెక్కచేయకుండా చీపురు పట్టి శ్రమించిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల రెక్కల కష్టమే.నాడు కాంగ్రెస్ హయాంలో రూ. 8,300 ఉన్న జీతాన్ని బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ గారు రూ. 16,600 కు పెంచారు.. మధ్యవర్తులు, కాంట్రాక్టర్లను తొలగించి కార్మికులకే నేరుగా గ్రూపుల ద్వారా జీతాలు అందేలా చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా కార్మికులకు ఒక్క రూపాయి జీతం పెంచలేదు.. కానీ నిత్యావసరాల ధరలు, బస్సు ఛార్జీలు, కరెంట్ బిల్లులు మాత్రం విపరీతంగా పెంచేశారు. సిద్దిపేట లో భూగర్భ డ్రైనేజీ, స్వీపింగ్ మిషన్లు, చెత్తకుండీల తొలగింపు, ఇంటింటికీ ఆటోలు, పందుల నివారణ చేపట్టి పారిశుధ్య కార్మికులకు శ్రమభారం తగ్గించాం. కాళేశ్వరం, మల్లన్న సాగర్ ద్వారా నల్లా ఆపరేటర్ల కష్టాలు తీర్చాం.. పెరిగిన ధరల నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలని, మిగతా విభాగాల వారికీ గ్రూప్ విధానం అమలు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వంపై గట్టిగా పోరాడుతాం.అన్నారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ నాయకులు పాలుగోన్నారు.

## సంగెం మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సై వంశీకృష్ణ

పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి.. గొడవలకు దూరంగా ఉండాలి

**ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో**




దసరా పండుగను పురస్కరించుకుని సంగెం మండల ప్రజలకు ఎస్సై కె. వంశీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే జమ్మి చెట్టు పూజలు, గొర్రెల బలి కార్యక్రమాలు, రావణ దహనం వంటి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పండుగ సమయంలో ఎలాంటి గొడవలు, వివాదాలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని, క్షణికావేశంలో ఘర్షణలకు దిగి పోలీస్ కేసుల పాలవద్దని ఎస్సై కోరారు. రావణ దహనం నిర్వహించే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా తగినంత నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. చిన్నపిల్లలను మంటలకు దూరంగా ఉంచాలని, నిర్వాహకులు భద్రతా చర్యలు పాటించాలని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తినా, గొడవలు జరిగే అవకాశం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో దసరా పండుగను ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

# మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

### బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య....

**(బుగ్గ కృష్ణమూర్తి ప్రజా తీర్పు, ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19**

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదిగి ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గొప్ప వరం లాంటిదని, బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఏ పార్టీ ద్వారా పదవి లభించినా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు అండగా నిలవాలని ఆగయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్‌గా నియమితులైన నంది కిషన్‌తోపాటు డైరెక్టర్లుగా నియమితులైన మిట్టపల్లి లక్ష్మణ్, సిరిపురం మహేందర్‌లను మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మేడిపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తోట ఆగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ.. ఏ పార్టీ అయినా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినప్పుడు దానిని బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా రైతాంగానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు సేవ చేస్తూ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

**రైతాంగానికి అండగా నిలుస్తాం.**



ఏఎంసీ వైస్ చైర్మన్ నంది కిషన్ మాట్లాడుతూ.. మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన తమకు వ్యవసాయ మార్కెట్ కమిటీలో వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతాంగానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామని, రైతులకు మేలు జరిగేలా పనిచేస్తూ అందరి ప్రశంసలు పొందేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని కోరారు.

**నూతన పదవీ బాధ్యులకు అభినందనలు.**

ఈ సన్మాన కార్యక్రమంలో సెస్సు డైరెక్టర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరస కృష్ణహరి, కొమిరిశెట్టి తిరుపతి, మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు బండారి బాలరెడ్డి, మీసం రాజం, కిష్టయ్య, అనిల్, మేగి నరసయ్య, ఉప్పుల రాజ్యం, రవి, దేవవ్వ, ఆకుల దేవేందర్, జవ్వాజీ లింగం, భూపతి, వద్నాల రాజు, నారాయణ తదితరులు పాల్గొని నూతనంగా నియమితులైన వారిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.



## ఖేలో ఇండియా వాలీబాల్ ఎంపిక పోటీలు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 19**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని తాళ్ల గురజాల గ్రామంలో ఖేలో ఇండియా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అండర్ 17 బాలురు, బాలికలకు వాలీబాల్ ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. బెల్లంపల్లి పోలీసు డిపార్టుమెంటు సహకారం తో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ వాలీబాల్ క్రీడాకారులు ఏసిసి రవి, తాళ్ల గుర్జాల ఎస్ఐ ప్రశాంత్, గురజాల సర్పంచ్ వంగ రాములు, చంద్రవెల్లి సర్పంచ్ శ్రీనివాస్, గురజాల ఉప సర్పంచ్ డాకూరి సురేష్, గురజాల వార్డు సభ్యులు వెంకటేష్, కోటయ్య, సీనియర్ క్రీడాకారులు ముస్తఫా రమేష్, రషీద్, నరేష్, సందీప్, కేశవ్, రాహుల్, సాయికుమార్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ని ఉద్దేశించి తాళ్ల గురిజాల సర్పంచ్ వంగ రాములు మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో నైపుణ్యం, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఈ వాలీబాల్ పోటీలలో ఎంపిక చేయడం జరుగుతుందని,ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని అన్నారు.ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

## రాజారాం పల్లిలో యువకుడు దారుణ హత్య

### పాత కక్షలతో నిండు ప్రాణం బలి

**కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ అక్టోబర్ 19**



జగిత్యాల జిల్లా రెండు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షతో పండగ వేల ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటన ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బొంతు మల్లయ్య ఉపాధి నిమిత్తం పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలో నివాసం ఉంటున్నారని, శివరాత్రి మల్లేష్, బొంతు మల్లయ్య కుటుంబాల మధ్య ఉన్న అక్రమ సంబంధాల వ్యవహారం కారణంగా రెండు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరిగేవని అదే నేపథ్యంలో వారి కుమారుడు బొంతు సంతోష్ (17) ఎండపల్లి మండలం రాజారాం పల్లి పాత గూడూరు చౌరస్తా వద్ద ఉన్నాడని తెలుసుకొని శివరాత్రి మల్లేష్ అతని కుమారుడు అనిల్ కుమార్ లు సంతోష్ పై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలు చేయగా రక్తస్రావంతో ఉన్న సంతోష్ ను స్థానికులు హుటాహుటిన అంబులెన్స్ సహాయంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అప్పటికే సంతోష్ మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు


**పిట్లం /అక్టోబర్ 19(ప్రజా తీర్పు ):**



కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను, ఆయన కుమారుడు మహమ్మద్ ఇలియాస్‌ను కాంగ్రెస్ నాయకులు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై షబ్బీర్ అలీతో చర్చించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ భూమని బాల్‌రాజ్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుల్లని సాయిలు, బట్టెంకి బాల్‌రాజు, గుల్లని రాజు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారిలా చలామణి అవుతున్న యువకుడు అరెస్ట్

**ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో**



పోలీస్ అధికారిగా చెప్పుకుంటూ భద్రకాళి ఆలయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని బందోబస్తు సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అతడి వద్ద రెండు నేషనల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో నకిలీ గుర్తింపు కార్డులు, వాహనంలో ఒక సర్టిఫికెట్ లభించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో భద్రకాళి ఆలయం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ఎం. కిరణ్, కానిస్టేబుల్ ఎం. భిక్షపతి.. నేవీ బ్లూ రంగు టీ-షర్టుపై 'పోలీస్ ' లోగో ధరించి విఐపీ దర్శనం వైపు వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తించారు. అతడిని ఆపి విచారించగా, తాను ఇంటెలిజెన్స్ బ్యూరో లో పనిచేస్తున్నట్లు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అనుమానం రావడంతో తనిఖీ చేయగా రెండు నకిలీ గుర్తింపు కార్డులు లభించాయి. అతడి వాహనంలో ఫేక్ సర్టిఫికెట్‌ను కూడా గుర్తించినట్లు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన బండి సుశాంత్ (24)ను అదుపులోకి తీసుకున్నారు. మట్టేవాడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 571/2026గా కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 205 కింద దర్యాప్తు చేపట్టినట్లు పోలీసుల పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయాలు, విఐపీ దర్శన మార్గాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ప్రభుత్వ లేదా పోలీసు అధికారులమని చెప్పుకుంటే వారి గుర్తింపు పత్రాలను ధ్రువీకరించాలని పోలీసులు సూచించారు.

# చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 19**



చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో 15వ వార్డులో అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించడం అభినందనీయమని, ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలమని తెలిపారు. డి.ఎం.ఎఫ్.టి. నిధుల ద్వారా 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా 70 షాపులను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని, స్లాట్‌ల వారీగా కేటాయింపు ప్రక్రియను నిర్వహించి 3, 4 నెలలలో పూర్తి చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, లారీల రాకపోకల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బైపాస్ రహదారి నిర్మాణానికి 1 కోటి 60 లక్షల రూపాయలతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలించి, పట్టణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు రహదారులు, డ్రైనేజీలు, మార్కెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు, అభివృద్ధి పనుల కోసం 6 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్‌లోని శివాలయ అభివృద్ధికి 17 కోట్ల రూపాయలతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలించడం జరుగుతుందని, పుష్కరాలకు వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డులలో సి.సి. డ్రైనేజీల నిర్మాణం చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం 20 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాన్‌వెజ్ మార్కెట్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముదిరాజ్, మైనారిటీ, గౌడ తదితర వర్గాలకు అవసరమైన కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సోమనపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు 200 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందించే పథకం అమలవుతుందని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, చదువుపై ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి క్యాజువాలిటీ విభాగం, అత్యవసర వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందిస్తున్న చికిత్స అంశాలను పరిశీలించి, సిబ్బంది హాజరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వైద్యులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాల వివరాలను తెలుసుకుని, వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తూ, ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆసుపత్రిలోని ఆర్.ఓ. ప్లాంట్‌ను పరిశీలించి, రోగులు, వారి సహాయకులకు శుద్ధి చేసిన త్రాగునీటిని అందించాలని, ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రతను పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని మధన పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీ చైర్ పర్సన్ సతీష్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మల్లికార్జున్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, డి.సి.హెచ్.ఎస్. డా. కోటేశ్వర్ రావు, ఆసుపత్రి పర్యవేక్షకులు డా. సత్యనారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగిద్ది పెరుమాండ్ల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గా పడిశెట్టి భూమయ్య

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ అక్టోబర్ 19 )**



దసరా పండుగను పురస్కరించుకొని కరీంనగర్ లోని రాంపూర్ శ్రీ గిద్ది పెరుమాండ్ల స్వామి ఆలయ దసరా ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్గా పడిశెట్టి భూమయ్యతో పాటు 16 మంది సభ్యులు ఆలయ ఈవో,ప్రధాన పూజారి సమక్షంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా శ్రీ గిద్ది పెరుమాండ్ల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు,ఎత్తున రామ్ లీలా కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించుటకు దైవ చింతన, ఆసక్తి కలిగిన 16 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య చైర్మన్.వంగ నాగరాజు బండ లక్ష్మి బత్తిని చిన్న రాజు బుర్ర రాహుల్ గడప అజయ్ తుల ప్రవీణ్ బొంగోని వీరయ్య గౌడ్ లావుడియా లక్ష్మి మహదేవుని మహేందర్ నేదునూరి మల్లయ్య ఆది జలపతి నంది ఈశ్వర్ రెడ్డి దాంసాని విజయలక్ష్మి బూర్ల అంజలి మల్యాల వెంకన్న గుప్తాని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతి, ప్రధాన పూజారి రామక శంకర్ శర్మ, మాజీ కార్పొరేటర్ రవీంద్ర గౌడ్, 39 వ డివిజన్ నాయకులు వేముల శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన ఉత్సవ కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ను కరీంనగర్ మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# కాజీపేటలో గంజాయి పట్టివేత..

## యువకుడు ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు

**ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేటలో పోలీసులు 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఈ నెల 18న కాజీపేట రైల్వే చిల్డ్రన్స్ పార్క్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన తాళ్ల సంగీత్ వర్మ (21) అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అతడి వద్ద ఉన్న కవర్‌లో 100 గ్రాముల ఎండు గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.5 వేలుగా అంచనా వేశారు. గంజాయిని విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అయితే ఈ విషయాన్ని తదుపరి దర్యాప్తులో నిర్ధారించాల్సి ఉంది. గంజాయితో పాటు మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనంను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొనగా, వారి పనితీరును ఉన్నతాధికారులు అభినందించినట్లు పోలీసుల ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

## జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకెన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో**



విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకెన్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, పోలీసు వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం సేవలందించే పోలీసు సిబ్బంది క్షేమంగా ఉండాలని, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరఫున ఎస్ పి జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



# మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ, వాహన పూజలు

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్,

**ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయుధ పూజలు, వాహన పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధాలకు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎం.టి.) విభాగంలో పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్, తన సతీమణి స్నేహా శబరీష్, ఐఏఎస్ తో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి ధర్మానికి, ధైర్యానికి, విజయానికి ప్రతీకగా నిలిచే పండుగ అని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలు తమ లక్ష్యాలను సాధిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ప్రజల రక్షణే లక్ష్యంగా ఆయుధ పూజలు

పోలీస్ విధుల్లో కీలకమైన ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది మరింత నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ధైర్యం, క్రమశిక్షణ, అప్రమత్తతతో వ్యవహరిస్తూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం ఎం.టి. విభాగంలో పోలీస్ వాహనాలకు పూజలు నిర్వహించారు. నేరాల నియంత్రణ, గస్తీ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, ప్రజలకు సత్వర సేవలు అందించడంలో పోలీస్ వాహనాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. వాహనాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుతూ, విధి నిర్వహణలో సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు.విజయదశమి పండుగ పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, విజయాలను తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో మహబూబాబాద్ జిల్లాలో శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# అఖిల భారత కల్లు గీత కార్మిక సంఘం సృష్టికర్త కామ్రేడ్ బొమ్మగానీ ధర్మ బిక్షం గౌడ్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 19**



వెల్గొరి గోవిందు అధ్యక్షతన సూర్యాపేట జిల్లా కేంద్రంలోజరిగింది ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు కేజీ కె ఎస్ 69 వ వార్షికోత్సవాలు సంఘం నిర్మాత బొమ్మగాని ధర్మభిక్షం పుట్టిన నేల సూర్యాపేట గడ్డమీద వార్షికోత్సవ సభలు జరుపుకోవడం అంటే ఆయన ఆశయం ముందుకు తీసుకెళ్లటం అని అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం కల్లుగీత కార్మికుల కొరకు సారధిగా రథసారథి గా మొదటినుండి సమరశీల పోరాటశీ చేస్తుందని కల్లుగీత కార్మికుల హక్కుల కొరకు సమరశీల పోరాటాలు చేయాలన్నారు. అట్లాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులు రాష్ట్రంలో 37వేల 381 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.వీరందరికీ ఎటువంటి షరతులు లేకుండా వృత్తి పెన్షన్ ఇవ్వాలని,ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామని, కల్లుగీత వృత్తిలో ఆధునీకరణ ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి చూపాలని. చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, నందనంలోని నీరా తాటి ఈత ఉత్పత్తుల ప్రాజెక్టు వెంటనే ప్రారంభించాలని,పెన్షన్ 4వేలు ఎక్సిగ్రేషియా పది లక్షలకు పెంచాలని, సూర్యాపేట జిల్లా కేంద్రాశీలో తాటి, ఈత, ఉత్పత్తులను ఏర్పాటు చేసి గౌడ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని, డిమాండ్ చేశారు. ఇంకా రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు, పరిష్కరించాలని, ప్రకృతి సంపదను కాపాడాలని అన్నారు. ఈ సమాజంలో రోజురోజుకు అనేక మార్పులు జరుగుతున్నాయని కల్లుగీత వృత్తిలో కూడా ఆధునీకరణ తీసుకురావాలని అందుకు ప్రభుత్వాలు పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో కోటి తాటి ఈత చెట్ల సంపద ఉన్నదని ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ప్రకృతి పానీయం కల్లు, నీరా ఆరోగ్యానికి ఎంతో మంచిదని, తాటి ఈత చెట్ల ద్వారా అనేక ఉత్పత్తులు తయారు చేయవచ్చని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. నాటి నుండి నేటి వరకు అనేక హక్కులు సంఘం ద్వారా సాధించుకున్నామన్నారు. సొసైటీలు, గీచే వానికే చెట్టు పథకం, పెన్షన్, ఎక్సిగ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి, నీరా కేఫ్, ప్రమాద నివారణకు సేఫ్టీ కిట్టు లాంటి కొన్ని సమస్యలు సాధించుకున్నామన్నారు. కల్లుగీత కార్మికుల కష్టాలను సమస్యలను పరిష్కారం చేయడానికి కల్లుగీత కార్మిక సంఘం రాజకీయ పార్టీలకతీతంగా పోరాటం చేస్తుందని అన్నారు.లిసంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరు గోవిందు మాట్లాడుతూలివృత్తిచేసే వారందరికీ కంఠమయ రక్ష సేఫ్టీ కిట్ ఇవ్వాలని, తాటి చెట్ల పైనుండి పడిన వారికి మెడికల్ బోర్డు సర్టిఫికెట్ ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఇవ్వాలని, తాడిచెట్లు నరికిన వారిపై కఠినమైన చర్య తీసుకోవాలని, అర్హత కలిగిన గీత కార్మికులకు సభ్యత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్గ్రేషియాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుణగంటి కృష్ణ డివిజన్ మాజీ అధ్యక్షులు గుండ గాని నాగభూషణం విగ్నేశ్వర సిల్క్ ప్రోప్రైటర్ బొమ్మ గాని సైదులు గౌడ్ జువెలరీస్ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్ కుమార్ గౌడ్ డాక్టర్ కృష్ణ గౌడ్ లెక్చరర్ చికూరి కృష్ణ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు బొమ్మగాని మారయ్య గుండ గాని శ్రీనివాస్ రాచకొండ నాగరాజు బోడ సైదులు బోడ పరశురాములు గుణగంటి సైదులు సొసైటీ డైరెక్టర్ కప్పల శశిరేఖ ఎల్గూరి రామ్మూర్తి మాద నవీన్ బొమ్మగాని వెంకన్న ఎల్గూరి వెంకటేశ్వర్లు వేముల కుమారస్వామి పత్తిని సైదులు మాస్ దేశ గాని వెంకటరమణ గుణగంటి వెంకన్న అంతటి సైదులు ఎల్గూరివెంకన్న శిగ గణేష్ గుణగంటి ప్రవీణ్ బొమ్మగాని మహేష్ చంద్ర చిత్తలూరి సైదులు మరియు గౌడ సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# మందమర్రి శివారులో పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- ఆరుగురు అరెస్ట్ రూ.86,230 నగదు, 6 సెల్‌ఫోన్లు,ఒక బైక్ స్వాధీనం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 19**

మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మందమర్రి శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, ఆర్ఎస్ఐ ప్రవీణ్ మరియు సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి రూ.86,230 నగదు,6 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అదుపులోకి తీసుకున్న వారి వివరాలు:

1. వడ్డే కుమార్ -- బెల్లంపల్లి, శాంతిఖని
2. దురిశెట్టి శ్రీనివాస్ -- బెల్లంపల్లి, సోమగూడెం
3. కర్ణ వెంకటేష్ -- మందమర్రి
4. సల్లు సతీష్ -- మందమర్రి మండలం, యాపల్
5. సల్ల సాధానందం -- మందమర్రి మండలం, మెదారం
6. కొట్టే కిషోర్ -- బెల్లంపల్లి, సోమగూడెం

అదుపులోకి తీసుకున్న ఆరుగురిని, స్వాధీనం చేసుకున్న,నగదు,సెల్‌ఫోన్లుబైక్‌తో సహా తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.



# కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

**(వినోద్, ప్రజా తీర్పు, ఉప్పల్, మేడ్చల్ జిల్లా) అక్టోబర్ 19**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు బోడుప్పల్‌లోని దేవి కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ప్రజా జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ,ప్రజలకు సేవ చేయడంలో ఎల్లప్పుడూ ముందుండాలని,ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించడం జరిగింది.భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతూ,ప్రజల మన్ననలు పొందాలని కోరుకుంటున్నాను.

# దసరా విందులో ఫుడ్ పాయిజన్.. 14 మందికి అస్వస్థత

## నలుగురికి బాన్సువాడ ఆసుపత్రికి తరలింపు

**పిట్లం /అక్టోబర్ 19(ప్రజా తీర్పు):**



కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అన్నారం తండాలో దసరా వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి నిర్వహించిన విందు భోజనం వికటించడంతో 14 మంది అస్వస్థతకు గురయ్యారు. వారికి వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తండాలో మూడు కుటుంబాలు దసరా వేడుకలు నిర్వహించగా, బంధువులను ఆహ్వానించారు. ఈ క్రమంలో ఒక కుటుంబం ఏర్పాటు చేసిన విందులో ఆహారం తిన్న 14 మందికి అస్వస్థత కలిగింది. వెంటనే వారిని పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో నలుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దసరా పండుగ వేళ విందు భోజనం వికటించడంతో అన్నారం తండాలో ఆందోళన నెలకొంది.

# మల్లన్నపేటలో మహిళలకు కోలల పంపిణీ



**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) అక్టోబర్ 19**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యూత్ నాయకుడు అవారి చందు గ్రామంలోని మహిళామణులందరికీ కోలలు పంపిణీ చేశారు. గ్రామంలోని ఆడపడుచులందరికీ సరిపడా కోలలను అందజేసి పండుగ వేడుకల్లో తన వంతు సహకారం అందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అవారి చందు చేసిన కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధంకి లక్ష్మీ మల్లారెడ్డి, వార్డు సభ్యులు, యూత్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020